క్లుప్తంగా

అల్లుకున్న నిర్లక్ష్యం



నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరంలోని సింగు వారివీధిలో ఓ విద్యుత్ స్తంభానికి పిచ్చి మొక్కలు అల్లుకుని ప్రమాద భరితంగా మారింది. స్తంభం నుంచి పది వరకూ కనెక్షన్లు ఉన్నాయి. గత కొద్దిరోజులుగా వర్షం కురిసినా, గాలులు వీచినా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా విద్యుత్ స్తంభాలు శుభ్రం చేసి తగు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి



నరసరావుపేట: ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, తదితర బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయు డీ సంఘ రాష్ట్ర సలహాదారు బి.థామసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక చదలవాడ కృష్ణయ్య ఉపాధ్యాయ భవన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వి.అరుణారావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు మాట్లాడుతూ పేరుకుపోయిన బకాయిలతో పాటు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, అన్నీ సంఘాలతో చర్చలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఏ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల వివక్షను ఆపేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన క్యాలెండర్‌ను స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యం.సాంబశివరావు, ఆనందరావు, కోటేశ్వరరావు, కుంభా సాంబశివరావు, కాలేషావలి పాల్గొన్నారు.

వరి కోత మిషన్ లారీ బోల్తా



వినుకొండ(నూజెండ్ల): వరికోత మిషన్‌ను తీసుకెళ్తున్న లారీ పంట పొలంలోకి దూసుకువెళ్లి బోల్తా పడిన సంఘటన మండల కేంద్రం నూజెండ్ల బీసీ కాలనీ వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. ప్రమాదవశాత్తు లారీ అదుపు తప్పి పొలంలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సమావేశం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. వివిధ శాఖల ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో సమీక్ష ఉంటుందని, సంబంధిత ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది హాజరుకావాలని ఆయన సూచించారు.

రబీ పైనే రైతుల ఆశలు

- నిరాశ మిగిల్చిన ఖరీఫ్
- తుఫానులు, చీడపీడలతో తీవ్ర నష్టం
- విస్తృతంగా రబీలో పొగాకు, మొక్కజొన్న, శనగ సాగు



గణపవరంలో సాగులో ఉన్న పొగాకు



చిరుమామిళ్లలో పత్తి చేను దున్నుతున్న రైతు

నాదెండ్ల: ఈ ఏడాది ఖరీఫ్ రైతులకు నిరాశ మిగిల్చింది. వరుస తుఫానులు, చీడపీడలు వెంటాడాయి. మార్కెట్ ధరల పతనంతో సాగు గిట్టుబాటు కాక రైతులు నష్టపోయారు. మండలంలో ఖరీఫ్‌లో సాగయ్యే ప్రధాన పంటలైన పత్తి 5,900 ఎకరాలు, మిర్చి 4,400 ఎకరాల్లో సాగు చేశారు. కౌలు ధరలు, విత్తనం మొదలు ఎరువులు, పురుగుమందులు, కూలీల ధరలు పెరగటంతో పంటల సాగు రైతులకు తడిసిమోపెడైంది. వీటికి తోడు పత్తిలో గులాబీ పురుగు ఉధృతి కారణంగా దిగుబడిపై ప్రభావం చూపింది. అంతేకాక రెండు మూడు తుఫానులు పంటను దెబ్బతీయటంతో నామమాత్రపు దిగుబడులే వచ్చాయి. సగటున ఎకరాకు పది క్వింటాళ్లు వస్తుందని ఆశించిన రైతులకు 5-6క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. ఈ ఏడాది సీసీఐ మద్దతు ధర క్వింటాకు రూ.7521 ప్రకటించింది. మొదట్లో తేమ శాతం పేరుతో కొనుగోళ్లు జరపలేదు. దీంతో రైతులు ఆందోళన, ప్రజాప్రతినిధుల చొరవ కారణంగా తేమ శాతంలో సడలింపు లభించింది.

తగ్గిన మిర్చి సాగు

గతేడాది కన్నా ఈ ఏడాది మిర్చి సాగు తగ్గింది. గతేడాది క్వింటా ధర గరిష్ఠంగా రూ.17 - రూ.18 వేలు పలికింది. కాగా ఖరీఫ్ ఆరంభం నాటికి ధరలు దిగజారాయి. కోల్డ్‌స్టోరేజీలో నిల్వ ఉంచిన మిర్చి మార్కెట్‌ను ముంచెత్తడంతో ధరలు పతనమయ్యాయి. మిర్చి రైతులు బొబ్బర తెగులు దెబ్బతో బెంబేలెత్తారు. పూత, పిందె దశల్లో బొబ్బర తెగులు విజృంభించటంతో పూత రాలిపోయింది. ఆకులు ముడతపడి మొక్క బలహీనమవటంతో దిగుబడులు భారీగా పతనమయ్యాయి. ఖరీదైన మిర్చి సాగు రైతులను నష్టాలపాల్జేసింది.

పత్తి రైతులకు తీవ్ర నష్టం

గతేడాది డిసెంబర్ మొదటి వారంలో ఫెంగెల్ తుఫాను తీవ్ర ప్రభావం చూపింది. దీంతో పత్తితీతకు సిద్ధంగా ఉన్న పొలాలు తడిచి పత్తి పనికి రాకుండా పోయింది. కాయలు కుళ్లి నేలపాలయ్యాయి. దీంతో ఎకరాకు కొన్నిచోట్ల 2-3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. 50 శాతం మంది రైతులు పత్తిని పీకి ప్రత్యామ్నాయ పంటల సాగుకు పొలాలను సిద్ధం చేశారు. పత్తి పీకిన పొలాల్లో పొగాకు, శనగ, పశుగ్రాసం, కొన్నిచోట్ల మొక్కజొన్న, ఆవాలు సాగుకు సిద్ధమయ్యారు. సంక్రాంతిలోపు మరింతమంది రైతులు రబీ పంటలు సాగు చేయనున్నారు.

శనగ మినహా మిగతా పంటలకు అనుకూలం



ప్రస్తుతం రబీ సాగులో భాగంగా పొగాకు, వరి, మొక్కజొన్న, నువ్వులు, ఆవాలు, పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. శనగ సాగుకు డిసెంబర్ మాసంతో అవకాశం ముగిసినందున ఇతర పంటలు సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం మండలంలో రైతులు 1220 ఎకరాల్లో శనగ, 650 ఎకరాల్లో మొక్కజొన్న, 450 ఎకరాల్లో పొగాకు, 250 ఎకరాల్లో వరి, 400 ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేపట్టారు.

–ఎ. హరిప్రసాద్,
నాదెండ్ల మండల వ్యవసాయాధికారి

ఆరుతడులకు తిప్పలు

డిసెంబర్ చివరి మాసం వరకూ ఫెంగెల్ తుఫాను ప్రభావంతో నేలలో తడి ఉండటంతో పంటల సాగుకు అనుకూలంగా మారింది. ప్రస్తుతం పొలాలు పొడిబారుతున్నాయి. మిర్చి తోటల్లో కోతలు ప్రారంభమయ్యాయి. మొదటి కోత కోశాక ఆరుతడులు వేసుకుంటే దిగుబడులు పెరిగే అవకాశం ఉందని రైతులు సాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. బావులు, బోర్లు, చెరువులు, వాగులు, ఇతర సాగునీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఆరుతడులు పెడుతున్నారు. సోలార్ పంపుసెట్లు, డీజిల్ ఇంజన్లతో నీటిని తోడి పంటలు తడుపుతున్నారు. వాగులు, చెరువులు దూరంగా ఉన్న చోట్ల రైతులు వ్యయప్రయాసలకోర్చి పైపులైన్లు ఏర్పాటు చేసి నీటిని పొలాలకు చేరుతున్నారు.



నాదెండ్లలో ఆరుతడులకు చెరువు నుంచి కిలోమీటర్ మేర వేసిన పైపులు

దిక్కూమొక్కు లేని ప్రాథమిక పాఠశాల

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- ఆవరణంతా అపరిశుభ్రత
- పాఠశాలలో మందుబాబుల ఆగడాలు



మేళ్లవాగు రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల

బొల్లాపల్లి : మండలంలోని మేళ్లవాగులో రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 62మంది విద్యార్థులు ఉన్నారు. నాడు-నేడు ఫేజ్ -1లో భాగంగా మౌలిక వసతులు ఏర్పాటయ్యాయి. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించారు గానీ రెండు వైపులా దారులకు గేట్లు పెట్టకపోవడం వల్ల ఇబ్బందిగా మారింది. రాకపోకలకు అడ్డంకులు లేకపోవడంతో పాఠశాల నుంచే కొందరు రాకపోకలు సాగిస్తుంటారు. పాఠశాలను ఆనుకొని నివాస గృహాలు ఉండటంతో అటుఇటు రాకపోకలు సాగించడంతో బోధనకు ఆటంకం కలుగుతోంది. రాత్రి వేళ మద్యం తాగడం, అక్కడే సీసాలు పగలగొట్టడంతో పాటు పాఠశాల ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా మారుతోంది. గ్రామపెద్దలు, దాతలు పాఠశాల అభివృద్ధికి నడుం బిగించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. గేట్లు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలను జరగకుండా చూడాలని ప్రధానోపాధ్యాయురాలు కె.సునీత విజ్ఞప్తి చేశారు.

గ్రామీణాభివృద్ధికి కృషి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తానని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు తెలిపారు. మండలంలోని బొప్పూడి లో ఆదివారం రూ.32.23 లక్షల అంచనాలతో జలజీవన్ మిషన్ ద్వారా పీడబ్ల్యూసీ పునరుద్ధరణ పనులను స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొప్పూడిలో తాగునీరు అందించే పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని తెలిపారు. వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి రూ.1200 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. సాగర్ నుంచి నీరు నేరుగా బొప్పూడి లోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు వచ్చేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. గ్రామస్తులు అడిగిన కమ్యూనిటీ హాలు నిర్మాణంపై కూడా దృష్టి పెడతామని చెప్పారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ పనులు అభివృద్ధి చేస్తామని చెప్పారు. అంతా సక్రమంగా జరిగితే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా చిలకలూరిపేట బైపాస్ ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. బొప్పూడి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు భారత్ మార్గదర్శి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



బస్సుల్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు: శాంతి..సహనం..సౌభ్రాతృత్వాలకు కేంద్రంగా ఉన్నందునే భారతదేశాన్ని ప్రపంచం గౌరవిస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. హైందవ శంఖారావం పేరిట విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో జరుగుతున్న భారీ బహిరంగసభ యడ్లపాడు మండలం నుంచి బస్సులు భారీగా తరలివెళ్లాయి. ఈ సందర్భంగా బోయపాలెంలో ఆదివారం శంఖారావం సభకు వెళ్లే బస్సులకు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సర్వ మతాల సమూహమైన భారతదేశం, శాంతి, సహనం, సౌభ్రాతృత్వాలకు కేంద్రబిందువుగా నిలవడం భారతీయులందరూ గర్వించాల్సిన విషయమని తెలిపారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఐకమత్యానికి దిక్సూచిలా నిలిచాయి కాబట్టే ప్రపంచదేశాలన్నీ గౌరవిస్తున్నాయని తెలిపారు. దేవాలయాల పరిరక్షణతో పాటు వాటికి స్వయం ప్రతిపత్తిని కల్పించాలనే సదుద్దేశాన్ని తెలియజేస్తూ నిర్వహిస్తున్న సభకు హాజరయ్యే వారందరూ చిత్తశుద్ధి, దృఢ సంకల్పంతో ఉండాలని ఆయన చెప్పారు. అనవసరమైన ఆగ్రహావేశాలకు లోనుకాకుండా శాంతి, సహనంతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నేతలకు సత్కారం



వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో వినుకొండ నియోజకవర్గానికి చెందిన ఎస్టీయూ నాయకులను ఘనంగా సత్కరించారు. నాయకులు గంటా నాగేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరావు, వల్లెపు శ్రీరాములు, కన్నెబోయిన బాలకృష్ణరావులను జిల్లా, రాష్ట్ర కార్యవర్గం సభ్యులు సన్మానించారు.

శావల్యాపురంలో...

నరసరావుపేట ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం మండల శాఖ అధ్యక్షులు బిల్లా రాజారమేష్, కార్యదర్శి కంప శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రముట్ల వెంకటరత్నంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ మండలస్థాయిలో సంఘ కార్యకలాపాలను విజయవంతం చేయటంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే దిశగా నేతలు పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు జోసఫ్‌సుధీర్‌బాబు, జిల్లా అధ్యక్షులు చంద్రజిత్‌యాదవ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం ఇన్నర్ వీల్ క్లబ్

క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత



చిలకలూరిపేట: సేవకు ప్రతిరూపం ఇన్నర్ వీల్ క్లబ్‌అని క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత చెప్పారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో డిస్ట్రిక్ చైర్మన్ ఆఫీషియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రోటరీ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రేమలత మాట్లాడారు. క్లబ్ సభ్యులు సొంతనిధులు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఫ్రీ మెడికల్ క్లినిక్‌కి రూ.10వేలు విలువ చేసే మందులను ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని అందజేశారు. కావూరు జెడ్పీ హైస్కూల్‌కు వాలీబాల్ కిట్‌ను, స్థానిక చౌదరయ్య స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థినికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఇద్దరు పేద మహిళలకు రెండు కుట్టుమిషన్లు అందజేశారు. వృద్ధాశ్రమ నిర్మాణానికి రూ.లక్ష అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నె విజయలక్ష్మి, దండా శేషమాంబ, రమాదేవి పాల్గొన్నారు.

దీక్షాదక్షతే లక్ష్య సాధనకు దిక్సూచి



విద్యార్థులకు మోటివేషన్ క్లాసు నిర్వహిస్తున్న కాళహస్తి సుబ్బారావు

యడ్లపాడు: దీక్షాదక్షత లేకుండా మనిషి జీవితంలో ఏది సులభంగా రాదని చెన్నై వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ ఫ్యాకల్టీ కాళహస్తి సుబ్బారావు చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 9,10 విద్యార్థులకు మోటివేషన్ తరగతుల్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులకు విలువైన విషయాలపై చైతన్యం కలిగించారు. ప్రధానంగా తొమ్మిది లక్షణాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. దూరదృష్టి, చదువుపై ఆసక్తి, క్రమశిక్షణ, ఉన్నతస్థాయికి ఎదగాలనే బలమైన కోరిక, విద్యా సంబంధమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలిపారు. సరైన వైఖరి, సమయ పాలన, వినయం, నిరంతర కృషి లక్షణాలు ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి. రామిరెడ్డి, ఉపాధ్యాయులు డి. సుధాకర్, యు. మల్లేశ్వరి, గ్రామ పెద్దలు నంబూరు శివరామకృష్ణయ్య, గోగడ హరిబాబు, గుంటుపల్లి రమణయ్య పాల్గొన్నారు.

నేడు బస్టాండ్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

అధికారుల హెచ్చరికతో కొంతమంది వ్యాపారులు స్వచ్ఛందగా తొలగింపు



రేకుల షెడ్లను కూలీలతో తొలగిస్తున్న యజమానులు

నరసరావుపేట: మున్సిపల్ అధికారులు పట్టణంలోని రోడ్ల మార్జిన్లలో ఆక్రమణ తొలగింపు పునఃప్రారంభించనున్నారు. వినుకొండరోడ్డులో ఆక్రమణల తొలగింపు పూర్తిచేసిన అధికారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను పురస్కరించుకొని వారం పాటు నిలిపివేశారు. సోమవారం నుంచి ప్రకాష్‌నగర్‌లోని రిక్షా సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగిస్తామని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ పి.సాంబయ్య పేర్కొన్నారు. మూడురోజుల ముందుగానే ఆక్రమణదారులకు తెలియజేశామన్నారు. ఆ రోడ్డులోని కొంతమంది ఆక్రమణదారులు ముందస్తుగా ఆదివారం స్వచ్ఛందంగా రోడ్డుపైకి వేసిన రేకుల షెడ్లు, కూరగాయల షాపులు తొలగించారు. మరికొందరు మున్సిపాల్టీ అధికారులు వచ్చినప్పుడు తొలగించుదాములే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి ఈ మార్గంలో వ్యాపార దుకాణాలు విరివిగా ఏర్పాటు చేశారు. సమీపంలోనే విద్యార్థుల హాస్టళ్లు ఉండటం, బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లేమార్గం కావటంతో ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా మారింది. మధ్యలో రిక్షాసెంటర్ నుంచి బస్టాండ్ వరకు వ్యాపార సముదాయాలు పెరిగాయి. సాయంత్రం ఆరుగంటల నుంచి తొమ్మిదిన్నర వరకు ఈ రోడ్డులో విపరీతమైన రద్దీ కనిప్తుంది. వ్యాపారులు దుకాణాలను మార్జిన్లలో ఏర్పాటుచేసి వాటి ముందు రేకుల షెడ్లు పైకి ఏర్పాటుచేయటంతో వాటి దగ్గరకు వచ్చేవారి వాహనాలు రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో జనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆక్రమణల తొలగింపు సత్ఫలితాలు ఇస్తుందేమో వేచి చూడాలి.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు

ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతుల ఆశాభావం



కంకి దశలో మొక్కజొన్న

శావల్యాపురం: మండలంలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది. మండలంలోని వేల్పూరు, గుంటుపాలెం, శావల్యాపురం,పొట్లూరు, కనమర్లపూడి తదితర గ్రామాల్లోని మూడు వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. పోషకాలు అధికంగా ఉన్న మండలంలోని నల్ల రేగడి భూముల్లో మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు సూచించడంతో మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు. యాంత్రీకరణ వల్ల సాగు కూడా సులభతరం అయింది .ఒక్కో ఎకరానికి రూ. 30వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులు అంచనా వేస్తున్నారు. బహిరంగ మార్కెటులో క్వింటా ధర రూ. 2,200 పలుకుతోంది. ఈ లెక్కన ఆదాయం కూడా బాగుంటుందని పేర్కొంటున్నారు.

మొక్కజొన్న సాగు సులభతరం

మొక్కజొన్న సాగు సులభతరంతో పాటు ఎరువులు వినియోగం కూడా తక్కువ. 120 రోజుల పంట కాలం. సాగుకు మూడు నుంచి నాలుగు విడతలు నీరు సరిపోతుంది. దీంతో వరి పూర్తయిన తర్వాత మాగాణి భూముల్లో రెండవ పంటలో భాగంగా మొక్కజొన్న సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. మాగాణి భూముల్లో మొక్కజొన్న పంట సాగుకు సులభతరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ధర తగ్గకుండా ప్రభుత్వం చూడాలి



నేను మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. నెల రోజుల వ్యవధిలో పంట కాలం పూర్తి అవుతుంది. ఎకరానికి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. చేతికి పంట రాగానే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి. ధర తగ్గకుండా దళారుల నుంచి మోసపోకుండా ప్రభుత్వంతో పాటు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–సూరబత్తిని నారాయణ, రైతు, వేల్పూరు

దళారుల నుంచి విముక్తి కల్పించాలి




నేను 10 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ప్రస్తుతం పంట ఆశాజనంగా ఉంది. బహిరంగ మార్కెటులో ధర బాగానే ఉంది.రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండాలంటే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కష్టపడి పండించిన పంటలకు ఆశించిన స్థాయిలో ఫలితం వస్తే సంతోషంగా ఉంటాం. దళారులు నుంచి విముక్తి కల్గించాలి.

–పురేటి శ్రీనివాసరావు, రైతు, గుంటుపాలెం

అనాథశ్రమానికి బియ్యం వితరణ

సత్తెనపల్లి: పట్టణంలోని సాధన అనాథ వృద్ధుల ఆశ్రమానికి విలియం కేరీ మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ, 8వ వార్డు క్రిస్టియన్ పేట కమిటీ సభ్యులు ఆదివారం 25 కేజీల బియ్యం వితరణ చేశారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడు తహసీల్దార్ గుజ్జర్లపూడి కరుణకుమార్ మాట్లాడుతూ అనాథ వృద్ధులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుజ్జర్లపూడి లాభాను, గుజ్జర్లపూడి మనోజ్‌కుమార్, బంకా బాబురావు, గుజ్జర్లపూడి చిన్న కృపారావు, గుజ్జర్లపూడి యోహాను తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారంలో రెడ్లు అభివృద్ధి సాధించాలి



నరసరావుపేట: వ్యాపారంలో ఉన్న రెడ్లు అందరూ ఒకరినొకరు సహకరించుకుంటూ అభివృద్ధి పథంలో పయనించాలని డాక్టర్ నవులూరి క్రాంతికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రకాష్ నగర్‌లోని ఎల్‌ఐసీ ఏజెంట్ తియ్యగూర వీరారెడ్డి కార్యాలయంలో రెడ్డి బిజినెస్ గ్రూపు(ఆర్‌బీజీ)కు చెందిన నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. డాక్టర్ క్రాంతికుమార్‌రెడ్డితో పాటు మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, న్యాయవాది ఆరె శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు గానుగపంట ఉత్తమరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రెడ్ల అభివృద్ధికి తామంతా కృషిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌బీజీ రాష్ట్ర స్థాయి ప్రతినిధులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాలు పంచుకున్నారు. స్థానిక ఆర్‌బీజీ ప్రతినిధులు జి.సాంబశివారెడ్డి, యర్రంరెడ్డి నాగేశ్వరరెడ్డి, ఈదా లింగారెడ్డి, టి.శ్రీనివాసరెడ్డి, నుసుం వెంకటరెడ్డితో పాటు పలువురు రెడ్లు హాజరయ్యారు.

‘వీక్షణం’ ఎడిటర్ వేణుగోపాల్‌పై దాడి హేయం



పోస్టర్లు ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్‌పై దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆదివారం స్థానిక స్టేడియం దగ్గర దాడిని ఖండిస్తూ పోస్టర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత నెల 29న హైదరాబాదు బుక్ ఫెస్టివల్‌లో షాపు నిర్వహిస్తున్న వీక్షణం బుక్ స్టాల్‌లో హిందుత్వంపై వ్యతిరేకించే పుస్తకాలున్నాయని కొందరు ఘర్షణకు దిగి, దుర్భాషలాడినట్లు తెలిపారు. యూట్యూబ్ ఛానల్‌లో అసభ్యకరంగా, రౌడీల్లాగా, చట్టవ్యతిరేకంగా పోస్టులు పెడుతూ బెదిరింపులకు దిగారని చెప్పారు. ఇలాంటి శక్తులు గతంలో కూడా గౌరీ లంకేష్, కల్బుర్గి లాంటి మేధావులను హత్య చేశారని తెలిపారు. చట్టబద్ధ పాలనని, చట్టాన్ని గౌరవిస్తున్నామని పేరుతో ఇలాంటి శక్తుల్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోట నాయక్, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.